క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

పట్టు పరిశ్రమను ఆదుకోవాలి

పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రునాయక్

తలకొండపల్లి: పట్టు పరిశ్రమను ఆదుకోవాలని పట్టు రైతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శక్రునాయక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కోరింతకుంటతండాలో గురువారం ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ఆంధ్ర, కర్ణాటకలో కిలో పట్టు గూళ్లకు రూ.600 ఇస్తుంటే హైదరాబాద్ మార్కెట్‌లో మాత్రం రూ.400 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కిలోకు రూ.200 నష్టం వస్తోందని తెలిపారు. ఆంధ్ర, కర్ణాటక మాదిరిగానే కిలో పట్టు గూళ్లకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టు షెడ్లు నిర్మించేందుకు 25 శాతం సబ్సిడీ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా పట్టు పరిశ్రమ అభివృద్ధికి సబ్సిడీలు, ప్రోత్సాహకం, మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు



మాల్ చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వెంకటనారాయణ

యాచారం: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మాల్ చెక్‌పోస్టు వద్ద గురువారం యాచారం ఎస్‌ఐ వెంకటనారాయణ ఆధ్వర్యంలో సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే కార్లు, ఇతర వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లోని ప్రయాణికులను తనిఖీలు చేశారు. ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగుల్లో తనిఖీలు చేశారు. షెడ్యూల్ ప్రకటనతోనే ఇలా తనిఖీలు చేస్తే ముందు మరేలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రూ.లక్షకు మించి నగదు తీసుకెళ్లాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఉంది.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ యాదిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న యాదిరెడ్డి

ఇబ్రహీంపట్నం: గ్రామగ్రామాన సీపీఐని బలోపేతం చేయాలని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కన్వీనర్ యాదిరెడ్డి అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాదిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా సమష్టిగా ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతునిచ్చి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నర్సింహ, నీలమ్మ, యాదయ్య, సంజీవ, రాజునాయక్, కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని ఇనాంగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు దేశారం శివకుమార్‌గౌడ్ ఇటీవల మృతిచెందడంతో గురువారం ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా శివకుమార్ తండ్రి దేశారం నందగౌడ్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే.. ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేశారపు సత్యం గౌడ్, చక్రవర్తిగౌడ్, శేఖర్‌గౌడ్, బాలశివుడు, రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కసిరెడ్డికి సన్మానం



కసిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తలకొండపల్లి: ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత గురువారం తలకొండపల్లి మండలానికి మొదటిసారిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీశైలం, పలువురు కాంగ్రెస్ నాయకులు కసిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, సర్పంచ్ శ్రీశైలం, సీనియర్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: కేజీబీవీలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



యాచారం: కుర్మిద్ద ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

బతుకమ్మ సంబురాలు

ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో గురువారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి దాండియా ఆడారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రపంచంలోనే పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం రూరల్: ఎంపీపటేల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు



ఆమనగల్లు: బతుకమ్మ సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఆమనగల్లు: బతుకమ్మ సంబరాల్లో విద్యార్థులు

తాత్కాలికంగా ధర్నా విరమిస్తున్నాం

- బండరావిరాల మైనింగ్‌జోన్ భూ నిర్వాసితులు
- 422రోజుల పాటు కొనసాగిన ధర్నా
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొనసాగిస్తామని వెల్లడి



ధర్నాకు దిగిన మైనింగ్‌జోన్ భూ నిర్వాసితులు (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని బండరావిరాల మైనింగ్ జోన్ కోసం సర్వేనంబర్ 268లోని 1050 ఎకరాల భూమిని కోల్పోయిన బండరావిరాల, చిన్నరావిరాలకు చెందిన నిర్వాసిత రైతులు తమకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత 422 రోజులుగా చేస్తున్న ధర్నాను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. తమనుంచి లాక్కున్న భూమికి బదులుగా భూమిని లేదా నష్టపరిహారం చెల్లించడంతో పాటు తమ గ్రామంలో ఏర్పాటు చేసిన మైనింగ్ జోన్‌ను ఎత్తివేయాలని అలాగే కొత్తగా క్రషర్లకు అనుమతులు ఇవ్వకూడదంటూ బాధిత రైతు నేతి క్రిష్ణయాదవ్ ఆధ్వర్యంలో 159మంది రైతు కుటుంబాలు ఏడాదిన్నర క్రితం సద్దుపల్లి కూడలిలో ధర్నాను ప్రారంభించిన విషయం తెలిసిందే. గత 422 రోజులుగా మంత్రులు, ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్లినా స్పందించకపోవడం దారుణమని పేర్కొంటున్న రైతులు ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ఎన్నికల కోడ్ అమలు కారణంగా స్థానిక పోలీసుల సూచన మేరకు ధర్నాను తాత్కాలికంగా ఎన్నికలు ముగిసే వరకూ విరమించుకుంటున్నామని, ఎన్నికల అనంతరం ఏ ప్రభుత్వం వచ్చినా కూడా తమకు న్యాయం జరిగేంత వరకూ తమ ధర్నాను కొనసాగిస్తామని తెలిపారు. రైతులు పావురాల ఐలయ్య, గంగయ్య, యాదగిరి, నరేష్, మణెమ్మ, ఐలమ్మ, వెంకటమ్మ, బాలమ్మ, రైతు కుటుంబ సభ్యులు ప్రకటించారు.

ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

హస్తినాపురం: విజయదశమి పండుగ సందర్భంగా కర్మన్‌ఘాట్ లోని శ్రీహరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో దేవీశరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయంలో గురువారం ఆయన ఆలయ ట్రస్టీ మెంబర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, దాతల సహకారంతో హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరన్ శర్మ పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ కోశాధికారి కొక్కొండ సూర్యప్రకాశ్ గుప్తా, దసరా నవరాత్రి ఉత్సవాల కమిటీ చైర్మన్ మిరియాల అంజయ్య గుప్తా, సద్ది సందీప్ రెడ్డి, పేర్వాల మణిపాల్ రెడ్డి, లంకల రమేశ్‌రెడ్డి, బొడ్ల మల్లికార్జున్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి




తలకొండపల్లి: ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కసిరెడ్డి తదితరులు

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాంపూర్, సంఘాయిపల్లిల్లో గురువారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాల గురించి వివరించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 6 గ్యారంటీ స్కీంలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, యూత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సోషల్ మీడియా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజీం, మండల ఎస్సీసెల్ చైర్మన్ చెన్నకేశవులు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రమేష్, సీనియర్ నేత కృష్ణ, తిరుపతిరెడ్డి, ఆరీఫ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో గడగడపకు కాంగ్రెస్..

ఇబ్రహీంపట్నం: గడప గడపకు కాంగ్రెస్ నినాదంతో ఇబ్రహీంపట్నంలోని 12వ వార్డులో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిచందు ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాష్ట్రంలో అమలు పరుస్తారని ప్రజలకు ఆమె వివరించారు. కాంగ్రెస్ గెలుపు కోసం నాయకులు పనిచేయాలన్నారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీకి ఉనికిలేదు.. కాంగ్రెస్‌కు కేడర్ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పది కోట్ల రూపాయలతో బంజారా భవనం నిర్మించారని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత ఆయనకే దక్కిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్‌లోని వంగ శంకరమ్మ గార్డెన్స్‌లో నిర్వహించిన గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలు ఏవైనా విజయం బీఆర్ఎస్ పార్టీదేనని, అన్ని సర్వేలు ఇదే విషయాన్ని చెబుతున్నాయని, రాష్ట్రంలో మూడవసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రస్తుతం బీజేపీకి ఉనికి లేదు, కాంగ్రెస్ పార్టీకి కేడర్ లేదని సుధీర్‌రెడ్డి అన్నారు. 2014లో ఉద్యమ నాయకుడికి ప్రజలు పట్టం కట్టారని, తొమ్మిదేళ్లలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించిందని అన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్‌దేనని అన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



కందుకూరు: మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

మంత్రి సబితారెడ్డి

కందుకూరు: తెలంగాణలోని సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని సార్లరావులపల్లి సర్పంచ్ రజితప్రవీణ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన పలువురు గురువారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరంతో పాటు రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ గెలుపు నల్లేరుపై నడకలాంటిదేనన్నారు. ప్రజలు మరోసారి కేసీఆర్ సర్కార్‌ను బలపర్చి హ్యాట్రిక్ సాధించేలా ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు కె.దశరథ, డైరెక్టర్ కె.దేవీలాల్‌నాయక్, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌నాయక్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు బాలూనాయక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి..

మహేశ్వరం: బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మరోసారి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా గెలిపిస్తాయని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెండ్యాల గ్రామానికి చెందిన పలువురు గురువారం మంత్రి రాజేశ్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి వివిధ పార్టీల నాయకులు పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నేతలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మహేశ్వరం గడ్డపైన ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తనను అధిక మెజార్టీతో గెలిపిస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, రైతు బంధు, రైతుబీమా, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణతో పాటు పలు సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ పార్టీని మూడోసారి గెలిపిస్తాయని ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో బాకృష్ణ, అంజయ్య, రమేష్, రామచంద్రయ్య, నర్సింహ, రామయ్య, బాల్‌రాజ్, మల్లేష్, గణేష్, సుధాకర్, సుమన్, అష్రఫ్, రబ్బానీ, అరవింద్, శేఖర్, శ్రీనివాస్, మల్లేష్, పర్వతాలు, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, మండల అధ్యక్షుడు రాజునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్, పెండ్యాల ఉపసర్పంచ్ గౌస్, నాయకులు అశోక్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, షరీఫ్ పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రీజియన్ బ్యాంక్ మేనేజర్ రమణారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు, నాబార్డు సంయుక్త ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రీజియన్ బ్యాంక్ మేనేజర్ రమణారెడ్డి హాజరై మాట్లాడుతూ.. సంఘం సభ్యులు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా, సురక్షబీమా యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ ద్వారా గోల్డ్ లోన్లు, ముద్ర లోన్లు, బిజినెస్ రుణాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కిషన్, ఫీల్డ్ అధికారి సాయివర్షిత, ఆర్‌పీలు మంగ, సరిత, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి

సంఘం సీనియర్ నేత జయేందర్ ముదిరాజ్



జయేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కందుకూరు: మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో అదనపు గదుల నిర్మాణానికి గాను మండల పరిధిలోని దాసర్లపల్లికి చెందిన ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకుడు కుర్నమోని జయేందర్‌ముదిరాజ్ తన సొంత డబ్బు రూ.10 లక్షలు ఆ సంఘం నిర్వాహకులకు అందజేశారు. దీంతో గురువారం ఆయన్ని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కాకి దశరథ, ఎడ్ల బాబురావు, ఎంపీటీసీ కాకి రాములు, డైరెక్టర్ పాండు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తాము కోరిన వెంటనే ఆర్థిక సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జయేందర్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అందరూ కలిసికట్టుగా ఉండి హక్కులను సాధించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లేష్, జి.యాదయ్య, ఎ.నర్సింహ, పి.జంగయ్య, అంజయ్య, సురేందర్, శ్రీధర్, జంగయ్య, నర్సింహ, బాల్‌రాజు, సుదర్శన్, రాజ్‌కుమార్, రాములు, నరేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మీడియా కమిటీ చైర్మన్‌కు సన్మానం



రాజును సత్కరిస్తున్న నాయకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ మండల ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రాజుగుప్తాను మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు నగేష్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ బాధ్యతలు చేపట్టినా ఆ పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేయాలని సూచించారు. రాజుగుప్తా భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. పేదల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో లింగస్వామిగౌడ్, శ్రీనివాస్, శేఖర్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, రమేష్, దేవేందర్, జగన్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌లో ఓటర్లు పెరిగారు!

- ఫైనల్ నోటిఫికేషన్ నాటికి ఓటర్ల సంఖ్య 5,66,185
- పురుషులు 2,96,018
- మహిళలు 2,70,697
- థర్డ్ జెండర్ ఓటర్లు 101
- 2018 ఎన్నికల్లో 4,01,137 మంది
- ప్రస్తుతం పెరిగిన ఓటర్ల సంఖ్య 1,65,048



ఎల్‌బీనగర్ మ్యాప్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజక వర్గంలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. ఈ నెల 4న ప్రకటించిన జాబితా ప్రకారం 5,66,185 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,96,018 , మహిళలు 2,70,697 మంది కాగా, థర్డ్ జెండర్ ఓటర్లు 101 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో యువ ఓటర్లు (18–19) సంవత్సరాలు ఉన్న వారు 8,566 మంది, దివ్యాంగులు 6,064 , 80 ఏళ్లు దాటిన వారు 8,385 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 50 మంది కాగా, ఎన్ఆర్ఐకి చెందిన ఓటర్లు 12 మంది ఉన్నారు. పోలింగ్ స్టేషన్లు సుమారు 570 ఉన్నాయి.

నాడు.. నేడు ఓటర్ల వివరాలు ఇలా.....

2108లో జరిగిన ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజక వర్గంలో 4,01,137మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,11,895 మంది కాగా, మహిళలు 1,85,129 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం 2023 అక్టోబర్ నాటికి 5,66,185 మంది ఓటర్లు ఉన్నారు. అంటే గతంలో కంటే ఈసారి 1,65,048 మంది పెరిగారు. ఎన్నికల నామినేషన్ నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎన్నికలకు టీమ్‌ల ఏర్పాటు...

ఎన్నికలు సజావుగా నిర్వహించేదుకు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి పంకజ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌తోపాటు వీడియో సర్వేయిలెన్స్ టీమ్స్ ఏర్పాటుతో పాటు ఎగ్జిట్ పోల్స్, ప్రభుత్వ భవనాలను రాజకీయ పార్టీలు వినియోగించకుండా, అనుమతి లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై ప్రకటనలు రాయకుండా చర్యలు చేపట్టామని ఆర్‌ఓ పంకజ తెలిపారు. పోటీ చేసే అభ్యర్థులు అనుమతి లేకుండా వాహనాల్లో తిరగకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే 040–24140937కు ఇవ్వాలని ఆమె కోరారు.

స్వచ్ఛ భారత్ అందరి బాధ్యత

జీఎస్ఐ డీడీజీ డాక్టర్ మాథ్యూ జోసెఫ్

మన్సూరాబాద్: పచ్చదనం, ఆరోగ్యం, స్వచ్ఛ భారతదేశం మనందరి బాధ్యతగా భావించాలని జీఎస్ఐ డీడీజీ డాక్టర్ మాథ్యూ జోసెఫ్ అన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (జీఎస్ఐటీఐ)లో ఫిట్ ఇండియా స్వచ్ఛత స్వేచ్ఛ రన్ 4.0ను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన రన్‌ను ప్రారంభించి ఉద్యోగులతో కలిసి రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీడీజీ మాట్లాడుతూ, ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 2020లో రూపొందించారని, 2023లో 4వ విడత రన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. శారీరక, మానసిక ఉల్లాసానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు.స్వచ్ఛ భారత్ ప్రజలందరి బాధ్యత అన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి రోజు వ్యాయామానికి సమయం కేటాయించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. రన్‌లో పీఆర్‌ఓ డాక్టర్ గంజి మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.